ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

- 2న సీపీఎం రాజేంద్రనగర్ మండల సమావేశం
- సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామెల్

రాజేంద్రనగర్: డిసెంబర్ 2న జరిగే మండల జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సామెల్ అన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సమావేశం జీఎం గట్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సీపీఎం బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రజలందరికీ అండగా ఉంటూ పని చేస్తుందన్నారు. పార్టీలో పని చేస్తున్న మండల కమిటీ సభ్యులతో పాటు సభ్యులందరూ క్రమ శిక్షణతో మెలగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని.. తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. నిరుద్యోగ యువతను ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.చంద్రమోహన్, మండల కార్యదర్శి జీఎం కురుమయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్.మోహన్, ఎస్.రామ్మోహన్‌రావు, సీఐటీయూ మండల కన్వీనర్ జె.రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్, మేనేజర్

మణికొండ: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మణికొండ గార్డెన్ కమ్యూనిటీ హాల్, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అనుమానాలను నివృత్తి చేయటంతో పాటు ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. సర్వే పత్రాలలో ఉన్న అన్ని వివరాలను క్రమ పద్ధతిలో నమోదు చేయాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్‌లో వివరాలు ఇవ్వండి...

మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటి వరకు కుల సర్వేలో పాల్గొనని వారు సోమవారం తమ ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌ల వద్ద తమ సమాచారాన్ని నమోదు చేసుకోవాలని మణికొండ, నార్సింగి మున్సిపల్ కమిషనర్‌లు కోరారు. అలా వీలు కాని వారు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వారు కంట్రోల్ రూం నంబర్: 18005997575 లేదా సెల్: 94402 79049లలో సమాచారం ఇవ్వాలని కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కంట్రోల్ రూం నంబర్స్: 95503 16600, 76600 31833లలో తమ సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రతి ఒక్కరికీ క్రీడలు ఎంతో మేలు చేస్తాయని, పరిపూర్ణ ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. తమకు నచ్చిన క్రీడను ఎంచుకుని రోజూ సాధన చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ, ఎంజీ పార్కులో బుద్ధి మాంద్యం విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్ స్కూల్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో కొందరు పిల్లలు బుద్ధి మాంద్యం, ఆటిజం సమస్యలతో జన్మిస్తున్నారని, వారిని ఎక్కడా తక్కువ చూడకుండా అన్ని రంగాలలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, కౌన్సిలర్‌లు కె. రామకృష్ణారెడ్డి, కె. లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, నాయకులు బి.ముత్యాలు, ఎస్. కిరణ్‌కుమార్, బి.శ్రీరాములు, బషీర్, లక్ష్మీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సమగ్ర కుటుంబ సర్వే

రాజేంద్రనగర్ డీసీ రవికుమార్



మాట్లాడుతున్న ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే దాదాపు తుది దశకు చేరుకుందని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో మొత్తం 85 వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇందులో ఆదివారం సాయంత్రానికి 70 వేల కుటుంబాల సర్వే పూర్తయిందన్నారు. రోజూ ఎన్యుమరేటర్లకు కేటాయించిన ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తూ పూర్తి చేసిన దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో అందజేస్తున్నారని తెలిపారు. ఐదు డివిజన్లలో 650 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి కావాల్సిన దరఖాస్తు ఫారాలు, ఇతర సూచనలు, సలహాలను అందజేసేందుకు 57 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారన్నారు. 57 మంది సూపర్‌వైజర్లకు ఎన్యుమరేటర్లను అప్పగించామన్నారు. సూపర్‌వైజర్లకు అప్పగించిన ఎన్యుమరేటర్లు నిత్యం తాము పూర్తి చేసిన దరఖాస్తులను అందజేస్తున్నారన్నారు. రోజువారీ ఫారాలను సూపర్‌వైజర్లు సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందజేస్తున్నారన్నారు. పూర్తయిన దరఖాస్తులను ట్రంక్ పెట్టెల్లో భద్రపరుస్తున్నామని తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సిబ్బంది ప్రజలకు పూర్తి వివరాలను వివరిస్తూ ఇబ్బంది కలుగకుండా సర్వే చేపడుతున్నారన్నారు. ప్రజలు సిబ్బందికి అందజేస్తున్న సహాయ సహకారాలు మరువలేవని వెల్లడించారు. త్వరలో వంద శాతం సర్వే ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రాజెక్టుల రూపకల్పనలో పోటీ పడాలి



తన ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న విద్యార్థి

లంగర్‌హౌస్: ఇంటర్ డిసిప్లెనరీ ఇన్నోవేషన్ కలిగి ఉండి ప్రాజెక్టుల రూపకల్పనలో మెకానిక్ ఇంజినీర్ విద్యార్థులు అంతర్జాతీయ ప్రాజెక్టులతో పోటీ పడాలని 7ఎస్ టెక్నాలజీ సంస్థ సభ్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్, డీఆర్‌డీఎల్‌కు చెందిన డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి అన్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎఫెక్స్ జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో ఇస్రో, డ్రోన్స్ హెచ్‌పీసీడీ, ఎస్‌సీపీటీ, టీబీఎ, ఐబీటీ సంస్థల నుంచి ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా ఉండి విద్యార్థులకు గ్లోబల్ ప్రాజెక్టుల రూపకల్పనలో దిశానిర్దేశాలు చేశారు. దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ రూపకల్పనలతో పోటీపడి ప్రతిభ చూపగా కర్ణాటకకు చెందిన విద్యార్థికి మొదటి బహుమతిగా 500 డాలర్లు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అడ్వెంచర్ థీమ్ పార్కుల రూపకల్పనలో జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు. ప్రపంచంలోని అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు మార్గదర్శక ఇన్నోవేషన్లు తెలిపే విద్యార్థులు, నిపుణులను ప్రోత్సహించడంతో పాటు వారికి సరైన ప్రాముఖ్యత ఇస్తూ బంగారు భవితను చూపడంలో ఎఎస్‌ఎంఈ ఫౌండేషన్ సంస్థ ముందుంటుందన్నారు. ప్రముఖులు మొహమ్మద్ సమీఉద్దీన్, స్వాతి ఆనందం, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గురజారావు, డాక్టర్ వీకెఎస్ఎస్ఎస్ మూర్తి, డాక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బహదూర్‌పురా: పేకాట స్థావరంపై బహదూర్‌పురా పోలీసులు, సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడితో పాటు మరో ఐదు మందిని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం..బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌బాగ్ ప్రాంతంలో మహ్మద్ రఫీక్ మరో ఐదుగురితో కలిసి పేకాట నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బహదూర్‌పురా పోలీసులతో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట నిర్వాహకుడు మహ్మద్ రఫీక్‌తో పాటు మరో ఐదు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.20,930ల నగదు స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పురా పోలీసులకు అప్పగించారు.

శంషాబాద్‌లో 50 పడకల..

ఆస్పత్రి కల నెరవేరేనా?

- శంషాబాద్ ప్రభుత్వాస్పత్రిలో అరకొర వసతులు
- నిధుల లేమితో పడకేసిన ప్రతిపాదన
- ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా కొరవడిన అభివృద్ధి
- నిత్యం రోగులకు తప్పని ఇబ్బందులు



శంషాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి

శంషాబాద్: శంషాబాద్ సర్కారు దవాఖానా 50 పడకల అభివృద్ధి ముచ్చట ముందుకు సాగుతుందా అనే విషయం సందేహాస్పదంగా మారింది. అరకొర వసతుల నడుమే రోగులకు సేవలందిస్తున్న సర్కారు దవాఖానాకు మంచి రోజులు వస్తాయని ఆశించిన సమయంలో నిధుల విడుదల కాస్తా నిలిచిపోవడంతో పరిస్థితి నిరాశను మిగుల్చుతోంది.

వైద్య విధాన పరిషత్‌లో విలీనమైనా...

- శంషాబాద్ సర్కారు దవాఖానాను నాలుగేళ్ల క్రితం వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేశారు. రికార్డుల్లో ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా అందుకు సంబంధించి వసతులు కల్పించలేదు.
- నిధులు కూడా విడుదల చేయలేదు. కమ్యూనిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన ఈ దవాఖానాలో ప్రస్తుతం 10లోపే పడకలు ఉన్నాయి.
- నిత్యం సుమారు 200 మంది వరకు ఔట్ పేషెంట్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. సరిపడా పడకలు లేనందున ఇన్ పేషెంట్లకు ఇబ్బందులు తప్పడం లేదు. కమ్యూనిటీ ఆస్పత్రి స్థాయిలో వైద్యుల నియామకమూ జరగలేదు.

గతేడాది ప్రతిపాదన...

- వైద్య విధాన పరిషత్ నుంచి అభివృద్ధికి నిధులు కేటాయించనందున రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ ఆదేశగా చర్యలు చేపట్టారు. హెచ్‌ఎండీఏ నుంచి మున్సిపాలిటీకి కేటాయించిన రూ. 50 కోట్ల నిధులు నుంచి 50 పడకల ఆస్పత్రికి రూ. 5.30 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమైంది.
- అయితే హెచ్‌ఎండీఏ కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు. దీంతో ఆస్పత్రి అభివృద్ధి ప్రతిపాదన కాస్తా మరుగున పడిపోయింది.
- నిధులు విడుదలైతేనే ఆస్పత్రి అభివృద్ధికి మోక్షం కలుగుతుందనడం నిర్వివాదాంశం. అప్పటి వరకు రోగులకు మాత్రం పాట్లు తప్పేలా లేవు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి నిధులు విడుదల తద్వారా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో జరుగుతున్న విద్యుత్ సబంధ మరమ్మతు పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ బి.అమర్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు గంధంగూడ పరిధిలోని ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవానీ కాలనీ, బైరాగిగూడ, శివసాయినగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, సాయిబాలాజీ నగర్, కె.కె-1, కె.కె-2, ఫీల్ గూడ్ హోమ్స్, శ్రీనివాస్ కాలనీ, తిరుమల హిల్స్ గుట్ట, గంధంగూడ గ్రామం, విఘ్నేశ్వర కాలనీ, చంద్రయ్య కాలనీ, కృష్ణారెడ్డి స్కూల్, డిస్కవరీ స్కూల్, గంధంగూడ గృహాలు, పావనీ పాటిల్, రఘురామ్‌నగర్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే రాధానగర్, నర్సారెడ్డి కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిట్రీస్ ఫేస్-2, పావనీ హార్మనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీ హిల్స్ మెయిన్ రోడ్డు, స్నేహిత హిల్స్ పరిధిలో పీఅండ్‌టీ కాలనీ ఏ, బీ, సీ, డీ, స్పెషల్ బ్లాక్, కీర్తి రిచ్‌మండ్ విలేజ్ ప్రాతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్నేహిత ఫేస్-1, 2, రాయలోక్ ఫర్నీచర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, స్టోనేజ్ అపార్ట్‌మెంట్స్, బార్డర్ వే హోటల్, షాదాన్ కాలేజ్, పీరంచెరువు గ్రామం, వాసంతీ ఆనంది, ఎంపైర్ విల్లాస్, గిరిధారి అపార్ట్‌మెంట్స్, పీఅండ్‌టీ కాలనీ ఏ, బీ, సీ, డీ, స్పెషల్ బ్లాక్ కీర్తి రిచ్‌మండ్, జన్నారం డబుల్ బెడ్‌రూమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మణికొండ పరిధిలో...

మణికొండ: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నడుమ ఇంటర్ లింకింగ్ పనులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13 నుంచి 30 వరకు, మాతృశ్రీ కాలనీ, పెంటయ్య నగర్, కూతుకుదుబ్ షా కాలనీ, సాయిగౌతం కాలనీ, సాయి చంద్రకాలనీ, గ్రీన్ స్పేస్, గ్రీన్ సిగ్నేచర్, బయూత్ కాలనీ, తిరుమల హిల్స్, ఖిజ్రా కాలనీ, డాలర్ హిల్స్ ప్రాంతాలలో సరఫరా ఉండదని ఆయన వివరించారు.

నేడు 'ప్రజావాణి': సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్లకు చెందిన ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

శంషాబాద్‌లో 92.5 శాతం సర్వే పూర్తి

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు సమగ్ర సర్వేకు సంబంధించిన వివరాలు ఇవ్వని వారు ఈ నెల 26లోపు తమ వివరాలు నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు సూచించారు. వివరాలు నమోదు చేయించుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలోని పి.కె.లతను ఫోన్: 80742 99298లో సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకు పట్టణంలో 92.5 శాతం సర్వే పూర్తయిందని ఆయన వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



శంషాబాద్: మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎం ఆర్‌ఎఫ్) పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతగానో వెసులుబాటు కల్పిస్తోందని 22 వార్డు కౌన్సిలర్ ఎం.శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి శంషాబాద్ పట్టణంలోని సాయం ఇంద్రమ్మకు మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును ఆదివారం ఆమెకు అందజేశారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికి అండంగా ఉంటుందని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్ సులేమాన్‌నగర్ అధ్యక్షుడిగా జహీరుద్దీన్

అత్తాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం సులేమాన్‌నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ జహీరుద్దీన్ నియమితులయ్యారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోకజవర్గ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో డివిజన్ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు అబ్దుల్ ముఖీద్‌చందా, పోరెడ్డి ధర్మారెడ్డి, అబ్దుల్ రెహమాన్, ఎం.డి.సలీం, కరీం, సహబాజ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న మహ్మద్ జహీరుద్దీన్

సంక్షేమ పథకాలు పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గోల్కొండ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దళారుల వద్దకు వెళ్లకుండా నేరుగా మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను లేదా నేరుగా తనను సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. అనంతరం ఆయన టోలిచౌకీ చౌరస్తా, సెవన్ టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టోలిచౌకీ చౌరస్తా ప్లై ఓవర్ కిందిభాగంలో డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయడం పూర్తి అయినా అధికారులు అక్కడ సరైన రోడ్డు వేయలేదని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ మజ్లిస్ నాయకులు అలీ ముద్దీన్, సయ్యద్ సిద్దిఖ్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



పీస్ కమిటీ సభ్యులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: ఆలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయాలు, ప్రార్థనా స్థలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్మానాలు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బంజారి దర్వాజా, బడాబజార్ తదితర ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాల్లో పర్యటించారు. మిర్జా ఎక్బాల్ అహ్మద్, సయ్యద్ మజహర్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

సందడిగా 'సీనియర్స్' వన భోజనాలు



వనభోజనాలలో పాల్గొన్న మై హోం అవతార్ సీనియర్ సిటిజన్స్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మై హోం అవతార్ సీనియర్ సిటిజన్స్ కార్తీక వనభోజనాల కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. మొయినాబాద్ మండలం, అజీజ్‌నగర్‌లోని ఓ ఫాం హౌస్‌లో నిర్వహించిన వనభోజనాలలో వారు రోజంతా ఉల్లాసంగా గడిపారు. పసందైన విందు భోజనాలను ఆరగించి, కార్తీకమాసం విశిష్టత, వన భోజనాల చరిత్ర తెలుసుకోవటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ



పూజలు నిర్వహిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

అత్తాపూర్: అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆదివారం హైదర్‌గూడ గ్రామం మారుమోగింది. వనం మహేందర్‌రెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని ఆయన అన్నారు. పూజల్లో డీసీసీబీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, వనం లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఘనంగా రెడ్డి ఫౌండేషన్ కార్తీక వనభోజనాలు



వనభోజనాలలో పాల్గొన్న రెడ్డి ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు



చరిత్రను వివరిస్తున్న మోహిత్‌నందన్‌రెడ్డి



హాజరైన రెడ్డి కుల ప్రతినిధులు

మణికొండ: కార్తీక వన భోజనాల సందర్భంగా మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం శివుడికి పూజలతో మొదలైన ఉత్సవాలు సాయంత్రం వరకు కొనసాగాయి. చిన్నారులతో పాటు పెద్దల నృత్యాలు, పాటలు, మ్యాజిక్ షో, మిమిక్రీ, సన్మానాలు, రెడ్డిల చరిత్రపై ఉపన్యాసాలు అందరినీ అలరించాయి. వనభోజనాల ప్రాంగణంలో పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పలు రంగాలలో రాణించిన రెడ్డి విద్యార్థులను సత్కరించటం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించారు. రెడ్డిల చరిత్రను ఎక్కడా ఆగకుండా అరగంట పాటు ఉపన్యసించిన పంచవటి కాలనీకి చెందిన మోహిత్‌నందన్‌రెడ్డికి పెద్ద ఎత్తున చప్పట్లతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిలతో పాటు పలువురు కుల పెద్దలు రెడ్డిలు ఐక్యంగా ఉండి ఒకరికి మరొకరు సహకరించుకోవాలని సూచించారు. రెడ్డి ఫౌండేషన్‌కు చాలా మంది దాతలు సహకరించారని, వారి సహకారంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, వైద్య సహాయాలను అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. చదువుకున్న యువతీయువకులకు ఉద్యోగాలు, వివాహాల విషయంలోనూ రెడ్డి ఫౌండేషన్ తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మిగిలిపోయిన రెడ్డిలు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. నాయకులు రమణారెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, రాంరెడ్డి, కృపాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాజారెడ్డి, సైదిరెడ్డి, గణేష్‌రెడ్డి, శైలజరెడ్డిలతో పాటు వేలాది మంది రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.